

# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

– ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



*సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబలమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి–అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.*

*హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పడుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్ వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)*

*అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.*

# మాయాబజార్ -5

## (గత సంచిక తరువాయి)

శశిరేఖ గది. లోపల శశి తలుపుకి ఆనుకుని ఉండగా నేపథ్యంలో రేవతి,బృందం "శశీ శశీ" పిలుపులు.

రేవతి: నిన్ను పెళ్ళికూతుర్ని చేద్దామని వస్తే వీళ్ళందర్నీ బయటికి తరిమి ఏవిఁటీ మూర్ఖం? మాట్లాడవేం? తలుపుతియ్యి.

శశి: ఎన్నిసార్లు చెప్పాలేవిఁటి? ఈ పెళ్ళి నాకిష్టం లేదు.

రేవతి–కిటికీ వద్దకి వచ్చి: శశీ.ఇక నీ ఇష్టం లేదు. నా ఇష్టం లేదు. ఇలా అల్లరి చేస్తే ఆగుతుందనుకున్నావేమో? పెళ్ళివారు తరలి వస్తున్నారు. ఇక నీ గారాబాలేమీ సాగవు. జాగ్రత్త. ముద్దుముద్దుగా ఈ ముచ్చట జరిపించుకో.

శశి: ముచ్చటేమిటి ముచ్చట. నా ఆశ నిరాశ చేసి నా హృదయాన్ని భగ్నం చేసి నా మనసుని పాడుచేశారు. నాకు జీవించటానికే ఇష్టం లేదు.

రేవతి: ఆఁఆఁ! శశీ ఏవిఁటా మాటలు? —రుక్మిణి శ్రీకృష్ణుల ప్రవేశం.

రుక్మిణి: ఏవిఁటక్కయ్యా?

రేవతి: ఏముంది తల్లీ. చిన్నప్పటినుంచీ మీరు నేర్పించిన విద్య! ఇప్పుడు నాకప్పగిస్తోంది..(ఎవరో ఒకరిపై నిందవేసి అక్కసు తీర్చుకోవాలిగా?)

శ్రీకృ: కోప్పడకండి వదినా. ఏదో చిన్నతనం. కాస్త మనసు కుదుటపడే వరకు అమ్మాయిని శాంతంగా విడిచిపెట్టండి. రేపటికి ఎంత మారుతుందో, ఎంత ఉత్సాహంగా వుంటుందో మీరే చూస్తారుగా?

రే: ఏమోనయ్యా. కృష్ణా. అన్నింటికీ నీవున్నావనే నా ధైర్యం. ఈ పెళ్ళి సక్రమంగా జరిపించి మన గౌరవం కాపాడే భారం నీది. (తిప్పుకుంటూ వెనుదిరిగి వెళ్ళి పోతుంది.)

శ్రీకృ: ఏవిఁటమ్మా ఇది? (శశి వెక్కివెక్కి ఏడుస్తూ లోపలకి వెళ్ళిపోతుంది) సరే రేపు నీకే తెలుస్తుందిగా? —శశి పక్కపైవాలి ఏడుస్తుంది.

నిండుపున్నమి రేయి. ఉద్యానవనంలో విరహవేదనలో అభిమన్యుడు.

పాట

చంద్రబింబంలో శశి కనిపించి పాడుతుంది.(ట్రిక్ ఫోటొగ్రఫీ) —అభిమన్యుని భావన.

శశి :

నీకోసమే నే జీవించునది– ఈ విరహములో ఈ నిరాశలో– నీకోసమే నే జీవించునది

వెన్నెల కూడా చీకటి ఐనా– మనసున వెలుగే లేకపోయినా– నీకోసమే నే జీవించునది

అభి: నిలువుటద్దంలో(ట్రిక్ ఫోటొగ్రఫీ)

విరహము కూడా సుఖమే కాదా– నిరతము చింతన మధురము కాదా

విరహము కూడా సుఖమే కాదా –నిరతము చింతన మధురము కాదా

వియోగ వేళల విరిసే ప్రేమల– విలువను కనలేవా...

నీ రూపమునే ధ్యానించునది– నా హృదయములో నా మనస్సులో

నీ రూపమే నే ధ్యానించునది

తోటలో శశిరేఖ వచ్చినట్లుగా అభిమన్యుని భ్రాంతి——

శశి: హృదయము నీతో వెడలి పోయినా– మదిలో ఆశలు మాసిపోయినా

మన ప్రేమలనే మరి మరి తలచి– ప్రాణము నిలుపుకొనీ... నీకోసమే నే జీవించునది

అభి: మెలుకువనైనా కలలోనైనా– కొలుతును నిన్నే ప్రణయదేవిగా...

లోకములన్నీ ఏకమె ఐనా– ఇక నా దానవెగా

నీ రూపమే నే ధ్యానించుచునది–

శశి:ఈ విరహము లో ఈ నిరాశలో నీ కోసమే నే జీవించునది

హిడింబ సుభద్రతో: ఏవిఁటేవిఁటీ? అభిమన్యునికిస్తానన్న శశిరేఖను సిగ్గులేక, దుర్యోధనుని కొడుక్కి ఇస్తున్నారా? (వెనక ఘటోత్కచుని ప్రవేశం.) అన్నగారయ్యుండీ బలరాముడే నిన్నింత అవమానిస్తాడా?

సుభద్ర: ఏం చేస్తాం? ఇప్పుడు మన ఐశ్వర్యమంతా పోయిందిగా అక్కా ?

హి: ఐశ్వర్యం పోతే ? ప్రతాపాలెక్కడికి పోతాయనుకున్నాడు?

సు: ఐశ్వర్యం పూజించేవారికి ప్రతాపాలేం కనిపిస్తాయక్కయ్యా? పాండవులు, పాండవుల ప్రతాపాలు కౌరవుల కాలిగోటికి సాటిరావని దూషణకూడా చేశాడు. —వెనకపాటుగా వింటున్న ఘటోత్కచునికి కోపంతో ఆవేశం వస్తుంది.

ఘటోత్కచుడు——ప్రకాశంగా: హై లంబు, హై జంబు. మోగించండి రణభేరి! —బయటికి వెళ్ళిపోతాడు.

సు: అబ్బాయి విన్నట్టున్నాడే?

హిడింబ —ఆరాటంతో: సుపుత్రా సుపుత్రా——ఇద్దరూలేచి ఆత్రంగా బైటికి వెళ్తారు.

బయట ప్రాంగణంలో – ఘటో: సహజనులారా. మీరింక సకలాయుధాలతో సర్వసైన్యాలతో సిద్ధపడండి. మనమిప్పుడు యుద్ధరంగానికి వెళ్తున్నాము.

అభిమన్యుడు వచ్చి : సోదరా. ఎవరితో యుద్ధానికి? నేనూ వస్తాను.

ఘటో: నేనుండగా నీవెందుకు సోదరా. సహజనులారా...

హి: సుపుత్రా సుపుత్రా——

ఘటో: విన్నాను మాతా విన్నాను. ఇచ్చినమాటలు తప్పుటయేగాక తుచ్ఛకౌరవుల పొత్తుకలుపుకుని జగదేక పరాక్రమవంతులైన మా జనకులనే తూలనాడిరిగా యాదవులు ? ఎంతమదమెంత కావరమెంతపొగరు? అంతకంత ప్రతీకారమాచరించి కౌరవుల యాదవుల కట్టగట్టి మట్టుపెట్టకయున్న నా మహిమయేల? —అనుచరులు ఉత్సాహంగా–హైహై నాయకా.

సు: నాయనా. మా అన్నతో యుద్ధానికి నువ్వెళితే ఒకటి, అబిమన్యుడు వెళితే ఒకటీనా? అది నాకు అప్రతిష్ఠ కాదూ?

ఘటో: అట్లైనమాతా. నేను హస్తినాపురికిపోయి ఆ కౌరవ హంతకులనైన హతమార్చరాదా?

హి: వారిని నీవు చంపరాదురా సుపుత్రా. నీ జనకులు ప్రతిజ్ఞలు చేశారు. వారి చేతిలో చచ్చుటకు వాళ్ళు బ్రతికే ఉండాలి. (ప్రచ్ఛన్నంగా, అంతర్వాహినిగా సున్నితమైన హాస్యం. Situational comedy)

ఘటో: చూచితివా సోదరా. మన మాతల కారణాన మన ప్రతాపాలకేమి గతి పట్టినదో? —అభిమన్యుడు నవ్వుతాడు.

హి: నేను చెప్పినట్లు చెయ్యరా సుపుత్రా. నేను మెచ్చుకుంటాను. [ఐనా ఆ కాలంలో మహిళలు కూడా అంత ప్రజ్ఞ కలిగి వ్యూహరచన చెయ్యగల సామర్ధ్యంగలవారని సూచన. మాయాబజార్–పురాణ పాత్రలతో కల్పిత గాథ. శశిరేఖ పాత్ర వ్యాస మహాభారతంలో కనపడదు.] —చెవిలో రహస్యం చెపుతుంది. హి: ప్రకాశంగా——నీవు ద్వారకకి వెళ్ళి నీ మాయాబలంతో శశిరేఖను ఇక్కడికి తీసుకునిరా. ఈ సుపుత్రునికిచ్చి పెళ్ళి చేస్తాను.

ఘటో: సుప్రశస్తము మాతా నీ ఆజ్ఞ! నేనిప్పుడే వెళ్ళెదను. అనుచరులారా...

సు: నాయనా. నువ్వొక్క మాటిస్తేనే ఇందుకైనా నేను సమ్మతిస్తాను. అక్కడ నీవు ఏ అఘాయిత్యమూ చెయ్యకూడదు. మా చిన్నన్నయ్య శ్రీకృష్ణుడు...

ఘటో: అస్మదీయులా? అట్లైనచో వారికి నమోనమః.

సు: అక్కడికి వెళ్ళగానే వారిని చూసి ...

హి: చూడటమేమిటి? వారి దర్శనంచేసి స్తోత్రం చెయ్యరా. వారు ప్రసన్నులౌతారు.

సు: ఏం చెయ్యాలో వారే నీకు చెపుతారు.

ఘటో–మాయమై, నేపథ్యంలో —సోదరా. నేను వచ్చువరకు ఆశ్రమ రక్షణ నీదే భారం.[Attention to detail. No loose ends in script] —అనుచరులు నూతన నాయకునకు జయజయధ్వానాలు...హైహై నాయకా.

పశ్చిమ సముద్రవేలావలయితమైన ద్వారకాపురిపై ఎగురుతూ ఘటోత్కచుని ప్రవేశం. బలరాముని మందిర ద్వారప్రవేశం చేసి కాపలాదారులను మాయతో మత్తులో ముంచుతాడు. తదుపరి అంతఃపురంలో నిద్రిస్తున్న స్త్రీలను చూస్తాడు.

ఘటో: ఇందులో శశిరేఖ ఎవరని!? పూర్వం లంకలో మా అన్న హనుమంతులవారు పడ్డ చిక్కులో పడ్డాను. తెలుసుకోకుండా వచ్చాను.– —అలా పోగాపోగా ఆరుబయట ఆవరణలో తిన్నెపైన కూర్చుని ఒక వామనుడైన విప్రుడు తంబురమీటుతూ తత్త్వం ఆలపిస్తూ ఉంటాడు. [వామనత్వంలో కూడా హాస్యం]

విప్రుడు:

చిరంజీవ చిరంజీవ– సుఖీభవ సుఖీభవ

అటువున్నది ఇటులేదు –ఇటువున్నది అటులేదు

అటువున్నది ఇటులేదు –ఇటువున్నది అటులేదు

ఇటునేనే అటునేనే– ఇటునేనే అటునేనే

అటునేనే ఇటునేనే– అటునేనే ఇటునేనే

చిరంజీవ చిరంజీవ సుఖీభవ సుఖీభవ!

ఘటోత్కచుడు అతనిపై చెయ్యి తిప్పి తన మాయను ప్రయోగిస్తాడు. మాయ పనిచెయ్యదు.

విప్రుడు:

చినచేపను పెదచేప –చినమాయను పెనుమాయ

చినచేపను పెదచేప– చినమాయను పెనుమాయ

అదిస్వాహా ఇదిస్వాహా– అదిస్వాహా ఇదిస్వాహా

చిరంజీవ చిరంజీవ– సుఖీభవ సుఖీభవ!

ఎరుగకుండవచ్చావు– ఎరుకలేకపోతావు

ఎరుగకుండవచ్చావు –ఎరుకలేకపోతావు

ఇదివేదం– ఇదెవేదం

ఇదివేదం ఇదెవేదం ఇదివేదం ఇదెవేదం...

ఘటో: ఏయ్ తాతా. నీ వేదం బాగానేవుందిగాని అసలు నువ్వెవరో చెప్పు.

విప్రుడు: ఓహోహోహో! నీవా?

ఘటో: ఆఁ!

వి: నీకుతెలియదూ నేనెవరో?

ఘ: తెలియకనేగా అడిగేది?

వి: ఉడికిస్తూ: తెలియనివానికి చెప్పినా తెలియదు.

ఘ: ఏయ్ తాతా. నీ కుతర్కం చాలించు. నీవెవరివైతే నాకేమిలే. చూడు... శశిరేఖ అనే చిన్నది ఎక్కడుందో కాస్త చెప్పు.

వి: హాయ్!నా సాయం కోరుతూ నన్నే అదిలిస్తున్నావ్? పేరుచెప్పి శరణుకోరి బుద్ధిగా అడుగు. చూపిస్తా. (ఘటోత్కచుని రాజ్యంలో నియమాలే!)

ఘటో–కోపంగా–: ఏయ్ తాతా. ఎవరనుకున్నావ్? జాగ్రత్త. నాకు ఆగ్రహంవస్తే ఆగను. నిన్నూ నీ ద్వారకను సాగరంలో ముంచిపోతాను.

వి: వెక్కిరింతగా.: అబ్బోఅబ్బో అంత ఘనుడివా? చెప్పవేం మరి? ఐతే నువ్వు అంత పని చెయ్యక్కర్లా. నేను ముసలివాడిని. నడవలేను. నన్ను మోసికొనిపో. అలాగే శశిరేఖను చూపిస్తాను.

ఘ: అలా రా దారికి. –విప్రుని జబ్బపట్టుకుని లేపుటకు ప్రయత్నిస్తాడు. సాధ్యం కాదు.——ఆశ్చర్యంగా–ఏయ్.ఇంత బరువున్నావే?

వి– వేళాకొళంగా——ద్వారకనే పెల్లగిస్తానంటివే? మరి నన్నెత్తలేవా? –పెదాలు బిగించి నవ్వుతూ.——ఎత్తునాయనా.ఎత్తూ!

ఘ: ఏనుగులు మింగావా? పర్వతాలు ఫలహారం చేశావా? ఏమిటి నీ మాయ?

వి: చినమాయను పెనుమాయ

ఇదివేదం ఇదెవేదం

అదిస్వాహా ఇదిస్వాహా

అటునేనే ఇటునేనే– అదినేనే ఇదినేనే ...

ఘటో– అర్థమై వివేకంతో చేతులు జోడించి నమస్కరిస్తూ––: తెలిసింది. తెలిసింది. నమోనమో నమోనమః. –శ్రీకృష్ణుడు ప్రత్యక్షమౌతాడు.

ఘ: ఆహా. నమోకృష్ణ నమోకృష్ణ నమోకృష్ణ నమోనమః.

శ్రీకృష్ణుడు ఆశీర్వదిస్తూ: చిరంజీవ చిరంజీవ– సుఖీభవ సుఖీభవ! (ప్రేక్షకులు నిస్సంశయంగా విప్రుడే శ్రీకృష్ణుడని తెలుసుకునేటందుకు. No stone unturned.)

ఘ: ధన్యోస్మి. ధన్యోస్మి. ఇక నీ ఆజ్ఞ. శ్రీకృష్ణుడు ఘటోత్కచుని దగ్గరకు పిలిచి : ఇక నీవు నిర్వర్తించవలసిన శుభకార్యం -- చెవిలో రహస్యంగా... (ఈ స్టిల్ ఫొటో వాల్ పోస్టర్లపైన, పత్రికల్లోను కనిపించి మురిపింపజేసింది.)

ఘ: ఆనందంగా...ఆహాహా.

శ్రీకృష్ణుడు చెలికత్తెతో: ఇకనుంచి నీవు ఇతనికే ఇష్టసఖివి.

ఘ: ఇక శలవా?

శ్రీకృష్ణుడు: అల్లుడూ.జాగ్రత్త.

ఘ: మీనా. మన అంతఃపురానికి దారి? –అక్కడ శశిరేఖను చూసి అభిమన్యునికి సరైన జోడీ అని తలచి ఆమెను శయ్యతో సహా మాయం చేస్తాడు. చెలికత్తె బిత్తరపోయి కిటికీలోంచి చూస్తే ఘటోత్కచుడు భయంలేదని సైగ చేస్తూ శయ్యతోసహా ద్వారకపై ఎగురుతూ నిష్క్రమిస్తాడు. (కథలో మరో మలుపు)

ఘటోత్కచుని భవనంలో——శయ్యతో సహా దించుతాడు. అంతలో సుభద్ర హిడింబ వస్తారు.

ఘటో: నమోమాతా నమోనమః.

హి: ఎంత చక్కనిదే నీ కోడలు?

సు: నాయనా. అక్కడేమీ అల్లరి జరగలేదుకదా?

ఘ: లేదుమాతా లేదు. అంతా నిశ్శబ్దంగానే జరిగింది. అంతా శ్రీకృష్ణులవారి చిద్విలాసం మాతా ! మళ్ళీ నేనక్కడికివెళ్ళి మన కౌరవులకు విడిది సత్కారం చెయ్యాలి.——సిగ్గు అభినయిస్తూ-- లక్ష్మణకుమారుని పెళ్ళి చేసుకోవాలి.

సు: నువ్వా?

ఘ: ఔనుమాతా నేనే మరి! మరదలికి మెలకువ వస్తుంది.నేను వస్తాను. –నిష్క్రమిస్తాడు.--

శశి నిద్రలో కలవరింత. – నా ఆశ నిరాశచేసి నా మనసు పాడుచేశారు. నాకు జీవించటానికే ఇష్టం లేదు. –సు:శశీ శశీ.——హి: ఇంకా కలవరిస్తూనేవుంది. –సు: చూడమ్మా నేను!. కళ్ళుతెరిచి విస్మయంతో చూస్తున్న శశితో. –సు:నేనమ్మా.

శశిరేఖ: అత్తయ్యా. ఎలావచ్చావు ఇక్కడికి?

సు: నేను కాదమ్మా. నీవే వచ్చావు.

శశై: నేనా? ఎక్కడున్నాను?

సు: భయపడకమ్మా. చెపుతానుగా. లే అమ్మా.

ఘ: చిన్నమయ, లంబు, జంబులతో——విన్నారుగా? ఆ పెళ్ళి పెటాకులు చెయ్యాలి. హై లంబు. హై జంబు. మీ తెలివితేటలు ఉపయోగించి కౌరవుల భరతం పట్టాలి.

లం: పెళ్ళి చెయ్యడం చేతకాదుగాని ...జం: పాడుచెయ్యమంటేనా?... ఇద్దరూ చిందులు వేస్తారు. (హింసాత్మక ప్రకృతి. దానికి ఆమోదంలభిస్తే అగ్నికి ఆజ్యం తోడైనట్లు. పైగా పుట్టుకతో రాక్షసులు! వాళ్ళు విజృంభిస్తే ఇక పట్టతరమా? ) చిన్నమయ వాళ్ళను తోడ్కొనిపోతాడు.

ఘ: ఆఁ. సోదరుడేడీ?

❦❦❦

ఉద్యానంలో దిగులుగా అభిమన్యుడు. ఘటోత్కచుడు మాయా శశిరేఖగామారి:

బావాబావాపన్నీరు-బావనిపట్టుకు తన్నేరు.

అభిమన్యుడు ఆనందంగా: శశీ ఎలావచ్చావిక్కడికి?

శశి: శశిట!శశి! చేతకాక విడిచిపెట్టి వచ్చి... దూరం.

అభి: ఎందుకు దూరం? పెద్దలమీది గౌరవంతో...

శశి: ఎక్కడికక్కడ నీవు మంచివాడివనిపించుకోవాలి. పెద్దలనెదిరించి నేను చెడ్డదాన్ని అనిపించుకోవాలి. చాలు. (స్త్రీసహజమైన సాధింపులు) ఇక నీకు నీ ప్రేమకు నమోనమః. ఇకమీదట మనప్రేమ సోదరప్రేమ.

అభి-ఆందోళనగా-- : శశీ ఏమిటా ఆగడం?

శశి: ఏమిటంటే అదే. ఇక నీ విరహాలు, తాపాలు నేను పడలేను. లక్ష్మణకుమారుని పెళ్ళడతానని మాటిచ్చాను. ఆడతాను.

అభి: నీవేనా శశీ —అలా మాట్లాడేది?

శశి: కాదు. నేనిప్పుడు సరికొత్త శశిని. పూర్తిగా మారిపోయాను. లక్ష్మణకుమారుని పెళ్ళడతాను. ఏనుగంబారీ ఎక్కుతాను. కోటదాకా ఊరేగుతాను.

అభి: శశీ ఏమిటీ వికారం? నీకేమైనా దెయ్యం పట్టిందా? (Irony of speech.-ధ్వని- మాయా శశిరేఖ రాక్షసుడేగా?- ఆనాటి డైలాగులు అంత పకడ్బందీగా ఉండేవి. పొల్లు ఎక్కడా కనపడేది కాదు. )

శశి: కాదు భూతం పట్టింది. ఇక మన ప్రేమమాత్రం సోదరప్రేమే! రా సోదరా ——చెయ్యిపట్టుకుని లాక్కుపోతుంది.

❦❦❦

ఘటోత్కచుని మందిరంలో——

హి: ఇదంతా నీ అదృష్టం పిల్లా. నీకోసం శ్రీకృష్ణులవారు,రుక్మిణి, రేవతి- బలరాములు,అంతా మా ఇంటికి వస్తారు.

శశి: మరి మా బావగారేరీ? —అభిమన్యుడు,మాయా శశి ప్రవేశం. (స్క్రీన్ పై ఇద్దరు శశిలు. ఆనాటికి టెక్నాలజీ అంతవరకు అభివృద్ధి చెందింది. )

మాయా శశిగా ఘటోత్కచుడు: వస్తున్నాను మరదలా. వస్తున్నాను. అభిమన్యుడు ఆశ్చర్యంగా ఇద్దరు శశిరేఖలను చూస్తాడు.

మాయా శశిగా ఘటోత్కచుడు: కంటివా సోదరా. ఇక నీవు నన్ను లక్ష్మణకుమారునికి ధారపోసి నీ శశిని నీవు తెచ్చుకో. —అందరూ ఆనందంగా నవ్వుతారు.

హి: సుపుత్రా. ఇదీ శ్రీకృష్ణులవారి ఉపదేశమేనా?

ఘ: ఔనుమాతా ఔను. ఇక ఈ పెళ్ళికూతురితో ఆ పెళ్ళికొడుకు ఎలా వేగుతాడో ఆ పరమాత్మునికే తెలియాలి!

శశి: అత్తయ్యా. మరి బావగారి మాటో? (నేరుగా బావగారితో మాట్లాడటం సాంప్రదాయం కాదు)

మాయా శశి గొంతు సవరించుకుని: ఈ బావగారిమాట నీకెందుకు మరదలా? నీ బావగారిని జాగ్రత్తగా చూసుకో. —ఘటోత్కచుని గొంతుతో-- అక్కడ నా ముహూర్తం ముంచుకొస్తూవుంది. నేపోతున్నాను. నమోమాతా..—— మంచంపై పడుకుని మాయా శశి: నమోకృష్ణ నమో నమః.——మంచంలేచి గాలిలో తేలుతూ కిటికీగుండా ఆకాశంలోకిపోయి అదృశ్యమౌతుంది. అభిమన్యుడు,శశిరేఖ,సుభద్ర, హిడింబ ఆనందంగా ఉంటారు.

ద్వారకలో– చిన్నమయ: పటం నేలపైపరిచి చూపుతూ–ఇది పెళ్ళివారి విడిదిగృహం. దీని ముఖ ద్వారం... లంబు:ఇటుపక్క. —చి: దక్షిణంవైపు కూడదురా. –జంబు: తసమదీయులకు అదేసరి. —చి: సరిసరి.——మంత్రదండం తిప్పగా విడిదిగృహం తయారౌతుంది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments